5 రోజుల ఈడీ కస్టడీకి ఆప్ ఎంపీ సంజయ్ సింగ్

న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం కేసులో బుధవారం అరెస్టయిన ఆప్ ఎంపీ సంజయ్ సింగ్‌ను ఐదు రోజుల పాటు ఈడీ కస్టడీకి ఢిల్లీ కోర్టు అప్పగించింది. ఆయనను ఈడీ ఈ నెల 10 వరకు ప్రశ్నించవచ్చు. గడువు ముగిసిన తర్వాత ఆయనను కోర్టులో హాజరుపరుస్తారు. 'మీరు ఏమైనా చెప్పాలనుకుంటున్నారా?' అని కోర్టు ప్రశ్నించినపుడు సింగ్ మాట్లాడుతూ, అమిత్ అరోరా, దినేశ్ అరోరా అనేక స్టేట్‌మెంట్లు ఇచ్చారని, అప్పట్లో వారు తన పేరును ప్రస్తావించలేదని, ఇప్పుడు హఠాత్తుగా వారికి తన పేరు గుర్తుకొచ్చిందని చెప్పారు. తనకు కనీసం ఒకసారి అయినా సమన్లు ఇవ్వలేదని, తనకు ప్రత్యేక చట్టం ఎందుకు అమలవుతున్నదని ప్రశ్నించారు. దినేశ్ అరోరా నుంచి తాను రూ.2 కోట్లు స్వీకరించినట్లు ఈడీ చేసిన ఆరోపణలను తోసిపుచ్చారు.

తమిళనాడు ఎంపీ ఇంటిపై ఐటీ దాడులు

బీజేపీవి ప్రతీకార రాజకీయాలు: స్టాలిన్

చెన్నై, అక్టోబర్ 5: తమిళనాడులో అరక్కోణంకు చెందిన డీఎంకే ఎంపీ ఎస్ జగత్‌రక్షకన్‌కు చెందిన నివాసం, కార్యాలయాలపై ఆదాయపు పన్ను శాఖ అధికారులు గురువారం సోదాలు నిర్వహించారు. వీటిల్లో పలు విద్యాసంస్థలు కూడా ఉన్నాయని అధికారులు తెలిపారు. ఐటీ సోదాలపై సీఎం స్టాలిన్ ధ్వజమెత్తారు. బీజేపీ ప్రతీకార రాజకీయాలకు పాల్పడుతున్నదని మండిపడ్డారు. కేంద్ర దర్యాప్తు సంస్థలను మోదీ సర్కారు దుర్వినియోగం చేస్తున్నదని దుయ్యబట్టారు. ఇండియా కూటమిని నిర్వీర్యం చేసేందుకు ఈ దాడులు నిర్వహిస్తున్నారని మండిపడ్డారు.

'ఉపాధి' కావాలంటే బీజేపీని సాగనంపాల్సిందే

ఎన్ఆర్ఈజీఏ సంఘర్ష్ మోర్చా పిలుపు

న్యూఢిల్లీ: దేశంలోని పేదలకు ఉపాధి కల్పించే మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ఆర్ఈజీఏ)ను పూర్తిగా ఎత్తివేసే కుట్రలో భాగంగానే కేంద్రం బెంగాల్‌లో దీనిని తాత్కాలికంగా నిలిపివేసిందని ఎన్ఆర్ఈజీఏ సంఘర్ష్ మోర్చా ఆరోపించింది. అయితే ఈ పథకాన్ని కాపాడేందుకు 2024 ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వాన్ని ఓడించాలని మోర్చా పిలుపునిచ్చింది. కార్మికులు, హక్కుల నేతలు, విద్యావేత్తలతో కూడిన ఎన్ఆర్ఈజీఏ సంఘర్ష్ మోర్చా ఇటీవల న్యూఢిల్లీలో జరిగిన రెండు రోజుల జాతీయ కన్వెన్షన్‌లో బెంగాల్‌లో నిలిపివేసిన ఎంజీఎన్ఆర్ఈజీఏ పథకం గురించి చర్చించింది.

గవర్నర్ నివాసానికి టీఎంసీ ర్యాలీ

కేంద్రం ఉపాధి బకాయిలపై కొనసాగుతున్న ఆందోళన

కోల్‌కతా, అక్టోబర్ 5: ఉపాధి హామీ బకాయిలను వెంటనే విడుదల చేయాలంటూ ఇటీవల రెండు రోజులు ఢిల్లీలో నిరసన చేపట్టిన టీఎంసీ నాయకులు తాజాగా కోల్‌కతాలోని గవర్నర్ నివాసం రాజ్‌భవన్ ముట్టిడి కార్యక్రమాన్ని చేపట్టారు. నగరంలోని రవీంద్ర సదన్ నుంచి దాదాపు నాలుగు కిలోమీటర్ల దూరంలోని రాజ్‌భవన్‌కు ర్యాలీగా బయలుదేరారు. తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) కీలక నేత అభిషేక్ బెనర్జీ నేతృత్వంలో జరిగిన ఈ ర్యాలీలో వేల మంది కార్యకర్తలు పాల్గొన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఉపాధి నిధులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

మణిపూర్‌లో కొనసాగుతున్న హింస

తాజాగా ఇంఫాల్‌లో ఇండ్లకు నిప్పు

ఇంఫాల్, అక్టోబర్ 5: మణిపూర్‌లో చెలరేగిన హింస నెలలు గడిచినా సద్దుమణగడం లేదు. తాజాగా రాజధాని ఇంఫాల్‌లో మరోసారి హింస చెలరేగింది. ఈ హింసలో రెండు ఇండ్లు కాలిపోయాయి. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు పోలీసులు గాలిలోకి కాల్పులు జరిపారు. ఓ చోట గుంపుగా గుమికూడిన మహిళలను చెదరగొట్టారు. బుధవారం రాత్రి 10 గంటల సమయంలో హింస చోటుచేసుకున్నదని, ప్రస్తుతం పరిస్థితి అదుపులోనే ఉన్నదని పోలీసులు చెప్పారు. సున్నితమైన ప్రాంతాల్లో భారీగా బలగాలను మోహరిస్తున్నామని వెల్లడించారు. కాగా, మణిపూర్‌లో మే 3 నుంచి ఇప్పటి వరకు జరిగిన హింసాత్మక ఘటనల్లో 180 మందికిపైగా మరణించిన విషయం తెలిసిందే.

మద్యం కేసులో ఆధారాలేవి?

మనీశ్ సిసోడియా

- సిసోడియా లంచం తీసుకొన్నట్టు రుజువులేవి?
- ఆయనపై మనీలాండరింగ్ కేసెలా పెట్టారు?
- ఒక ముద్దాయి స్టేట్‌మెంట్‌తోనే కేసు నడుపుతారా?
- ఎవిడెన్స్ చైన్‌ను ఎందుకు సిద్ధం చేయలేదు?
- ఈ కేసు కోర్టులో 2 నిమిషాలు కూడా నిలువదు
- ఈడీ తీరుపై సుప్రీంకోర్టు తీవ్ర అసహనం
- కోర్టు సూటి ప్రశ్నలతో ఈడీ ఉక్కిరిబిక్కిరి



న్యూఢిల్లీ, అక్టోబర్ 5: దేశవ్యాప్తంగా రాజకీయ దుమారం రేపిన ఢిల్లీ మద్యం కేసులో సుప్రీంకోర్టు సంధించిన ప్రశ్నలకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) బిత్తరపోయింది. ఢిల్లీ మాజీ మంత్రి, ఆప్ నేత మనీశ్ సిసోడియా బెయిల్ పిటిషన్‌పై విచారణ సందర్భంగా జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టితో కూడిన ధర్మాసనం వేసిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేక ఈడీ న్యాయవాదులు బిత్తరచూపులు చూశారు. ఈడీ దాఖలు చేసిన అభియోగాలు కోర్టులో రెండు నిమిషాలు కూడా నిలువవని ధర్మాసనం తేల్చిచెప్పింది. ఏ ఆధారాలతో సిసోడియాను అరెస్టు చేశారని సూటిగా ప్రశ్నించింది. ఇంత ప్రాధాన్యమున్న కేసులో ఆధారాల వరుసక్రమాన్ని ఈడీ ఎందుకు సిద్ధం చేయలేకపోయిందని నిలదీసింది.

సుప్రీంకోర్టు ప్రశ్నలు

1. మీరు (ఈడీ) ఈ కేసులో ఆధారాల క్రమాన్ని సిద్ధంచేయాల్సి ఉన్నది. డబ్బు మద్యం లాబీ నుంచి ఫలానా వ్యక్తికి చేరిందని అంటున్నారు. ఎంతో రహస్యంగా సాగే ఇలాంటి కేసులో ఆధారాలు సేకరించటం కష్టమని మీతో మేం ఏకీభవిస్తాం. కానీ, ఆధారాల కోసం మీరు ఎక్కడ ప్రయత్నించారు?
2. నిందితుడికి ఒకసారి రూ.100 కోట్లు, మరోసారి రూ.30 కోట్లు ముట్టాయని మీరు అభియోగాలు మోపారు. ఈ డబ్బు మద్యం లాబీ నుంచే వచ్చినట్టు ఆధారాలెక్కడ? ఆ కుంభకోణంతో సంబంధం లేని వ్యక్తుల నుంచి కూడా ఈ డబ్బు వచ్చి ఉండవచ్చు కదా?
3. ఈ కేసులో నిందితుడైన దినేశ్ అరోరా ఇచ్చిన వాంగ్మూలం తప్ప ఇంకేమైనా ఆధారాలున్నాయా? ఉంటే అవెక్కడున్నాయి?
4. విధాన (మద్యం విధానం) నిర్ణయం మారిందని మేం అర్థంచేసుకొన్నాం. వ్యాపారానికి మంచి చేసే ఏ విధానాన్నైనా అందరూ సమర్థిస్తారు. తమకు అనుకూలంగా మార్చుకొనేందుకు ప్రయత్నించే ప్రెషర్ గ్రూప్స్ కూడా ఉంటాయి. అసంబద్ధమైనవైనా ఆర్థిక లావాదేవీలు లేని విధాన నిర్ణయాలు పెద్ద విషయం కాదు. అందులో ఆర్థిక లావాదేవీలుంటేనే నేరమవుతుంది.
5. మీరు నమోదుచేసిన అభియోగాలను బట్టి ఈ కేసులో మనీశ్ సిసోడియా ఎక్కడా ప్రత్యక్షంగా భాగస్వామి కాలేదు. ఆమ్ ఆద్మీ పార్టీ సమాచార విభాగం అధిపతి, వ్యాపారవేత్త విజయ్‌నాయర్ మాత్రమే భాగస్వామి అయ్యారు. అలాంటప్పుడు మనీలాండరింగ్ కేసులో మనీశ్ సిసోడియాను ఎందుకు అరెస్టు చేశారు? ఆ డబ్బు సిసోడియాకు చేరలేదు. ఒకవేళ ఈ కుంభకోణంతో సంబంధం ఉన్న ఏదైనా కంపెనీతో ఆయనకు సంబంధాలుంటే అది ప్రత్యామ్నాయ బాధ్యత అవుతుంది. మనీలాండరింగ్ పూర్తిగా భిన్నమైనది?
6. సిసోడియా, నాయర్ ముడుపుల గురించి మాట్లాడుకోవటం మీరు చూశారా? ఈ అభియోగాలు ఆమోదయోగ్యమేనా? అప్రూవర్ వాంగ్మూలం ఒక అనుమానం మాత్రమేకదా? ఈ వాంగ్మూలం ఆమోదయోగ్యమేకానీ అసలైన ఆధారాలు కావాలి కదా? క్రాస్ ఎగ్జామినేషన్‌లో ఈ కేసు రెండు నిమిషాలు కూడా నిలువదు.

బుల్డోజర్‌తో తొవ్విన రోడ్డును పరిశీలిస్తున్న అధికారులు

కమీషన్ ఇవ్వలేదని రోడ్డు ధ్వంసం

- నిర్మాణ సంస్థ కార్మికులపై కర్రలతో దాడి
- యూపీలో బీజేపీ నాయకుడి దౌర్జన్యం

డబుల్ ట్రబుల్ | ఇంజిన్

షాజహాన్‌పూర్(యూపీ): ఉత్తరప్రదేశ్‌లో అధికార బీజేపీ నేతలు బరితెగించారు. కాంట్రాక్టర్ తమకు కమీషన్ ఇవ్వలేదన్న అక్కసుతో ఏకంగా బుల్డోజర్‌తో రోడ్డును ధ్వంసం చేశారు. అంతటితో ఆగకుండా నిర్మాణ సంస్థ కార్మికులపై దాడికి దిగారు. రోడ్డు నిర్మాణ కంపెనీ మేనేజర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది. కట్రా స్థానానికి ప్రాతినిధ్యం వహిస్తున్న బీజేపీ ఎమ్మెల్యే వీర్‌విక్రమ్ సింగ్ అనుచరుడు ఈ దౌర్జన్యానికి పాల్పడ్డాడని రమేశ్ సింగ్ ఫిర్యాదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం తాను ఎమ్మెల్యే ప్రతినిధినని రోడ్డు నిర్మాణ సంస్థ ఉద్యోగులకు పరిచయం చేసుకొన్న జగ్‌వీర్ సింగ్ రోడ్డు నిర్మిస్తున్నందుకు 5 శాతం కమీషన్ ఇవ్వాలని పలుమార్లు రోడ్డు నిర్మాణ కంపెనీనిని డిమాండ్ చేశాడు. జైతిపూర్-బుదాన్ జిల్లా మధ్య రోడ్ నిర్మాణం జరుగుతున్నది. అయితే కమీషన్ ఇవ్వలేదన్న కోపంతో ఈ నెల 2న జగ్‌వీర్ సింగ్ 15-20 మందితో కలిసి రోడ్డు నిర్మిస్తున్న కార్మికులను కర్రలతో చితకబాది బుల్డోజర్‌తో అర కిలోమీటర్ మేర రోడ్డును తవ్వేశాడు. నిందితులను అరెస్ట్ చేసేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. ఘటనపై ప్రజా పనుల శాఖ నుంచి సమగ్ర నివేదిక వచ్చిన తర్వాత చట్టపరమైన చర్యలు తీసుకొంటామని అదనపు జిల్లా మెజిస్ట్రేట్ సంజయ్ కుమార్ పాండే వెల్లడించారు. పోలీస్ బందోబస్తు మధ్య రోడ్డు నిర్మాణ పనులు మళ్లీ మొదలయ్యాయని తెలిపారు. రోడ్డు తవ్వకంపై ఘటనపై ఎమ్మెల్యే వీర్‌విక్రమ్ సింగ్ స్పందిస్తూ నిందితుడు తన ప్రతినిధి కాదని, అయితే అతడు బీజేపీ నాయకుడేనని అంగీకరించారు.

నార్వే రచయితకు సాహిత్య నోబెల్

- జాన్ ఫోసేను వరించిన పురస్కారం
- మాటల్లో చెప్పలేని వాటికి స్వరాన్ని ఇచ్చారు: నోబెల్ కమిటీ

స్టాక్‌హోం, అక్టోబర్ 5: నార్డిక్ దేశాల సాహిత్యంలో అద్భుతమైన నాటకాలు, నవలలు, చిన్న పిల్లల కథలు రాసిన ప్రముఖ రచయిత జాన్ ఫోసెను 2023 సాహిత్య నోబెల్ వరించింది. నార్వేకు చెందిన జాన్ ఫోసెను ఈ ఏడాది సాహిత్య నోబెల్‌కు ఎంపిక చేశామని 'రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ లిటరేచర్ కమిటీ' గురువారం ప్రకటించింది. 'వినూత్న నాటకాలు, గద్య పద్య రచనలు చేశారు. మాటల్లో చెప్పలేని ఎన్నో అంశాలకు ఆయన తన రచనల ద్వారా స్వరాన్ని ఇచ్చారు. మానవ అభద్రత, చింత, ఆతృత, ఆందోళన మొదలైన వాటికి ప్రాధాన్యం ఇచ్చారు' అని నోబెల్ లిటరేచర్ కమిటీ చైర్మెన్ అండర్స్ ఒల్సాన్ అన్నారు. ఆయన రాసిన 40 వరకు నాటకాలు, నవలలు, చిన్న పిల్లల కథలు డెన్మార్క్, నార్వే, స్వీడన్, ఫిన్లాండ్, ఐస్‌లాండ్.. దేశాల్లో ఎంతగానో ఆదరణ చూరగొన్నాయి. ద నేమ్, డ్రీమ్ ఆఫ్ ఆటం, ఐయామ్ విండ్.. నాటక ప్రదర్శనలు యూరప్, అమెరికాలో చాలా పాపులర్.

మైనారిటీ భాషలో రచనలు

నార్వేలో అధికార భాషగా గుర్తింపు అందుకున్న 'బోక్మాల్'లో కాకుండా కేవలం 54 లక్షల మంది చదవగల, రాయగల 'న్యోనోర్స్క్' భాషలో జాన్ ఫోసె రచనలు సాగటం గమనార్హం. ఆయనకు నోబెల్ సాహిత్యం దక్కటంపై గ్రామీణ నార్వే పెద్ద ఎత్తున హర్షం వ్యక్తం చేస్తున్నది. 95ఏండ్ల తర్వాత నార్వే రచయితకు నోబెల్ ప్రైజ్ వచ్చిందని, న్యోనోర్స్క్ భాషకు ఇది చరిత్రాత్మక రోజుగా నార్వే సాంస్కృతిక మంత్రి జాఫ్రే పేర్కొన్నారు. జాన్ ఒలావ్ ఫోసె 1959లో నార్వేలోని హేగ్‌సండ్ ప్రాంతంలో జన్మించారు. సాహిత్యంపై ఆసక్తి పెంచుకున్న ఆయన లిటరేచర్‌లో పట్టా పొందారు. 1983లో ఆయన 'రెడ్, బ్లాక్' పేరుతో తొలి నవల రాశారు. ఆ తర్వాత అనేక నాటకాలు, చిన్న కథలు, కవిత్వాలు, చిన్నారుల పుస్తకాలు రచించారు.

త్వరలో యూపీలో భారీ భూకంపం!

కాన్పూర్, అక్టోబర్ 5: త్వరలో ఉత్తరప్రదేశ్, చుట్టుపక్కల రాష్ట్రాల్లో భారీ భూకంపం సంభవించే ప్రమాదం ఉన్నదని ఐఐటీ కాన్పూర్‌కు చెందిన భూకంప నిపుణుడు హెచ్చరించారు. నేపాల్‌లో మంగళవారం వచ్చిన భూకంపం కారణంగా ఢిల్లీ, ఎన్సీఆర్ ప్రాంతాల్లోనూ భూప్రకంపనలు సంభవించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఐఐటీ కాన్పూర్‌కు చెందిన ప్రొఫెసర్ జావేద్ మాలిక్ మాట్లాడుతూ.. గంగా నదీ తీరంలో ఉన్న గ్రామీణ ప్రాంతాల్లో భవిష్యత్తులో మరింత తీవ్రమైన భూకంపం సంభవించే అవకాశం ఉందన్నారు. అయితే ఇది ఎప్పుడు వస్తుందన్నది అంచనా వేయలేమన్నారు.

మధ్యప్రదేశ్ రోడ్లు గుంతలమయం

- రాష్ట్రంలో దెబ్బతిన్న వేల కిలోమీటర్ల రహదారులు
- ఇన్నాళ్లూ పట్టించుకోని బీజేపీ డబుల్ ఇంజిన్ సర్కార్
- ఎన్నికల నేపథ్యంలో మరమ్మతులు చేయాలంటూ అధికారులకు ఆదేశాలు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, అక్టోబర్ 5 (నమస్తే తెలంగాణ): బీజేపీ పాలిత మధ్యప్రదేశ్‌లో రోడ్లు ఆధ్వానంగా మారాయి. రాజధాని భోపాల్ సహా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో వేలాది కిలోమీటర్ల మేర రహదారులు దెబ్బతిన్నాయి. ఇన్నాళ్లు వీటిని పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వం.. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో హడావుడిగా మరమ్మతులు చేపట్టాలంటూ అధికారులను ఆదేశించింది. రాష్ట్రంలోని 72 వేల కిలోమీటర్ల రహదారుల్లో 50 శాతానికి పైగా రోడ్లలో పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. 6 వేల మార్గాల్లో చాలాచోట్ల తారు కొట్టుకుపోయి గుంతలు పడ్డాయని, వాటికి అతుకులు వేయాల్సిన అవసరం ఉన్నదని రాష్ట్ర ప్రభుత్వానికి గతంలోనే ఓ నివేదిక అందింది. దీనిపై ఏడాది క్రితం ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన సీఎం శివరాజ్ సింగ్ చౌహాన్.. రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని సూచించారు. అయితే కనీసం 25 శాతం కూడా గుంతల మరమ్మతులు పూర్తి కాలేదు.

రాజధానిలో మరిన్ని గుంతలు

రాజధాని భోపాల్ ప్రాంతంలో చాలా రోడ్లు గుంతలతో నిండిపోయాయి. భోపాల్, సీహోర్, రాజ్‌గఢ్, విదిశా, రైసిన్‌లలో గత వర్షాకాలం భారీ వానలు కురవడం వల్ల రోడ్లు చాలా దెబ్బతిన్నాయని ప్రభుత్వానికి నివేదికలు అందాయి. ముఖ్యంగా భోపాల్ నుంచి అయోధ్యకు వెళ్లే బైపాస్ మార్గం చాలా దెబ్బతిన్నది. తాజాగా ఎన్నికలు సమీపిస్తున్న క్రమంలో హుటాహుటిన రోడ్లను మరమ్మతులు చేయాలని, అక్టోబర్ 10లోగా పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

బీజేపీ ఎన్నికల 'స్కీమ్'లు

- 130కి పైగా పథకాలకు నిధులు ఆపేసిన చౌహాన్ సర్కార్
- ఎన్నికల 'స్కీమ్'ల కోసమే!
- ఇటీవల 'లాడ్‌లీ బెహనా' పథకం ప్రకటన
- ఎన్నికల వేళ మరిన్ని పథకాలు
- ఇప్పటికే లోటు బడ్జెట్, అప్పల్లో రాష్ట్రం
- ఓటమి భయంతో ఓటర్ల ఆకర్షణకు పాట్లు

డబుల్ ట్రబుల్ | ఇంజిన్

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, అక్టోబర్ 5 (నమస్తే తెలంగాణ): మధ్యప్రదేశ్‌లో రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో అధికారాన్ని కాపాడుకొనేందుకు బీజేపీ పడరాని పాట్లు పడుతున్నది. ప్రభుత్వంపై ప్రజలు తీవ్ర ప్రజాగ్రహంతో ఉన్న నేపథ్యంలో ఓటమి తప్పదని గ్రహించిన కమలం పార్టీ ఓటర్లను ఆకర్షించే ప్రయత్నాలకు దిగింది. మరికొద్ది నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు జరుగనుండగా.. సీఎం శివరాజ్ సింగ్ చౌహాన్ ఇటీవల రూ.23 వేల కోట్ల ఎన్నికల తాయిలాలు ప్రకటించారు. రాష్ట్రంలోని మహిళలకు ప్రతి నెలా రూ.వెయ్యి చెల్లిస్తామంటూ 'లాడ్‌లీ బెహనా యోజన' పథకాన్ని ప్రారంభించారు. దీనికితోడు విద్యార్థినులకు స్కూటీల కోసం ఆర్థిక సాయం చేస్తామని గత ఆగస్టులో సీఎం చౌహాన్ ప్రకటించారు. లాడ్‌లీ బహనా పథకానికి ఏడాదికి రూ.19 వేల కోట్ల ఖర్చు అవుతుందని అంచనా. ఇప్పటికే రాష్ట్రం లోటు బడ్జెట్‌లో ఉన్న నేపథ్యంలో దీనికి నిధులు సమకూర్చుకొనేందుకు ప్రభుత్వం ఇతర పథకాలకు నిధుల విడుదలను నిలిపివేయడంపై విమర్శలు వస్తున్నాయి. ఈ ఏడాది జూన్ నుంచి 130కి పైగా పథకాలకు బీజేపీ సర్కార్ నిధులను ఆపేసింది. ఈ మేరకు 41 శాఖల అధికారులకు ఆర్థిక శాఖ ఆదేశాలు జారీచేసింది. ఆయా పథకాలకు నిధులు విడుదల చేసే ముందు తప్పనిసరిగా ఆర్థిక శాఖ అనుమతులు పొందాలని అందులో పేర్కొన్నది.

పెరుగుతున్న అప్పుల భారం

రాష్ట్ర బడ్జెట్ ఇప్పటికే లోటులో కొనసాగుతున్నది. బడ్జెట్ లెక్కల ప్రకారం ప్రభుత్వ ఆదాయం 2.25 లక్షల కోట్లు ఉంటే ప్రతి ఏడాది 54 వేల కోట్లు అప్పులు చేస్తున్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం 3.32 లక్షల కోట్ల అప్పుల్లో కూరుకుపోయింది. 2023-24 బడ్జెట్ అంచనాల ప్రకారం 2024, మార్చి 31 నాటికి అప్పులు 3.85 లక్షల కోట్లకు చేరుతుందని అంచనా. గత 20 ఏండ్ల గణాంకాలు చూస్తే రాష్ట్ర ప్రభుత్వం 20 వేల కోట్ల నుంచి 3.85 లక్షల కోట్లకు అప్పులు ఊబిలో కూరుకుపోయింది. మధ్యప్రదేశ్‌లోని తలసరి అప్పు రూ.3,300 నుంచి రూ.50 వేలకు పెరిగింది. ఈ క్రమంలో ఎన్నికల ముందర బీజేపీ ప్రభుత్వం చేస్తున్న అలవికాని హామీలపై విమర్శలు వస్తున్నాయి.

అదే బాటలో కాంగ్రెస్

మరోవైపు రాష్ట్రంలో అధికారం ఎలాగైనా దక్కించుకోవాలని కాంగ్రెస్ పార్టీ కూడా రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గందరగోళంగా ఉన్నా ఎడాపెడా హామీలు ఇస్తున్నదనే విమర్శలు వినిపిస్తున్నాయి. రాష్ట్రంలోని ప్రతి మహిళకు ప్రతి నెలా 'నారీ సమ్మాన్ యోజన' కింద రూ.1,500 ఇస్తామని పార్టీ పెద్దలు ఇటీవల ప్రకటించారు. మరిన్ని పథకాలు ఎన్నికల మ్యానిఫెస్టోలో ఉంటాయని ఊదరగొడుతున్నారు.

'కావేరి జలాల్ని విడుదల చేయలేం'

బెంగళూరు, అక్టోబర్ 5: కావేరి జలాల్ని తమిళనాడుకు విడుదల చేయాలన్న ఆదేశాలను సమీక్షించాలని కోరుతూ కావేరీ వాటర్ మేనేజ్‌మెంట్ అథారిటీ (సీడబ్ల్యూఎంఏ) ఎదుట కర్ణాటక పిటిషన్ దాఖలు చేసినట్టు ఆ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తెలిపారు. తమిళనాడు మొదట్నుంచీ వ్యతిరేకిస్తున్న 'మేకదాటు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్' ప్రాజెక్ట్ పనులు కొనసాగిస్తామని స్పష్టంచేశారు. 'కావేరీ బేసిన్‌లో 106 టీఎంసీల నీరుండాలి. అప్పుడే దిగువకు నీటిని విడుదల చేయగలం' అని ఆయన తెలిపారు.

'ఒక్క చుక్క అదనపు నీటిని పంచుకోం'

చండీగఢ్: పంజాబ్, హర్యానా మధ్య నీటి పంచాయతీ మళ్లీ మొదటికొచ్చింది. పక్క రాష్ట్రాలతో ఒక్క చుక్క అదనపు నీటిని పంచుకోవడానికి సిద్ధంగా లేమని పంజాబ్ సీఎం భగవంత్ మాన్ చెప్పారు. అవసరమైతే ఎంతవరకైనా పోరాడుతామని తెలిపారు. సట్లెజ్-యమునా లింక్ కెనాల్ కోసం పంజాబ్‌లో కేటాయించిన భూమి వివరాలపై సర్వే చేయాలని కేంద్రాన్ని సుప్రీంకోర్టు ఆదేశించిన మరుసటి రోజే మాన్ 'ఎక్స్'లో నీటి పంపకంపై ఇలా స్పందించారు.

ఒకే రోజు ఆరుసార్లు ఆగిన గుండె!

లండన్, అక్టోబర్ 5: ఇండో అమెరికన్ విద్యార్థి గుండె ఒకే రోజు ఆరుసార్లు ఆగింది. బ్రిటన్‌లో ఈ ఘటన జరిగింది. వైద్యుల శస్త్రచికిత్సతో అతడు ప్రాణాపాయం నుంచి కోలుకున్నాడు. టెక్సాస్‌లోని బేలార్ యూనివర్సిటీలో ప్రీ మెడ్ డిగ్రీ చదువుతున్న అతుల్ రావు పల్మనరీ ఎంబోలిజం అనే వ్యాధితో బాధపడుతున్నాడు. దీని కారణంగా రక్తం సరఫరా కాక గుండె ఆగిపోయే పరిస్థితి ఏర్పడేది. ఇలా ఐదారు సార్లు ప్రాణాపాయ పరిస్థితిని ఎదుర్కొన్న అతుల్ లండన్‌లోని ఇంపీరియల్ హెల్త్ కేర్‌కు చెందిన ఎన్‌హెచ్ఎస్ ట్రస్టు దవాఖానలో శస్త్ర చికిత్సలు చేయడంతో కోలుకున్నాడు.



నాసా సోలార్ మిషన్‌కు భారత సంతతి శాస్త్రవేత్త సారథ్యం

వాషింగ్టన్, అక్టోబర్ 5: సూర్య గ్రహణ అధ్యయనం కోసం నాసా ప్రయోగిస్తున్న మూడు సౌండింగ్ రాకెట్ల మిషన్‌కు భారత సంతతి శాస్త్రవేత్త ఆరోహ్ భర్జత్య సారథ్యం వహించనున్నారు. ఆయన ప్రస్తుతం ఎంబ్రీ-రిడ్డిల్ ఏరోనాటికల్ యూనివర్సిటీలో ఇంజినీరింగ్ ఫిజిక్స్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. ఈ ప్రయోగం ఈ నెల 14న జరగనున్నది. సూర్యుడి వెలుతురు హఠాత్తుగా తగ్గడం మన ఉపరితల వాతావరణాన్ని ఎలా ప్రభావితం చేస్తుందనే అంశాన్ని ఈ ప్రయోగంలో అధ్యయనం చేయనున్నారు. ఈ నెల 14న సూర్య గ్రహణాన్ని చూసేవారు సూర్యుడి సాధారణ ప్రకాశంలో 10 శాతం తగ్గుదలను గమనిస్తారు.

ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన చెక్క భవనం

సిడ్నీ, అక్టోబర్ 5: ప్రపంచంలోనే అతి ఎత్తైన చెక్క భవనం పశ్చిమ ఆస్ట్రేలియాలోని దక్షిణ పెర్త్‌లో నిర్మాణం కానున్నది. ఈ హైబ్రీడ్ టవర్‌ను 42 శాతం మాస్ టింబర్‌తో 191.2 మీటర్ల ఎత్తుతో నిర్మించనున్నారు. కార్బన్ డయాక్సైడ్ మొత్తం ఉద్గారాల్లో 8 శాతం సిమెంట్ నుంచి వెలువడుతున్నాయని.. ఈ నేపథ్యంలో చెక్క లాంటి సామగ్రితో భవనాలు నిర్మించడం వల్ల పర్యావరణంపై పడే ప్రభావాన్ని తగ్గించవచ్చని యూనివర్సిటీ ఆఫ్ న్యూ సౌత్‌వేల్స్ ప్రొఫెసర్ ఫిలిప్ ఓల్డ్‌ఫీల్డ్ తెలిపారు.

స్పేస్ స్టేషన్ నిర్మించనున్న ఇస్రో!

న్యూఢిల్లీ: చంద్రయాన్-3 ప్రయోగం విజయవంతం కావడంతో ఇస్రో భారీ లక్ష్యాలపై దృష్టి సారించింది. భవిష్యత్తులో అంతరిక్ష కేంద్ర నిర్మాణం, సుదీర్ఘ కాల మానవ సహిత అంతరిక్ష నౌక ప్రయోగానికి ప్రయత్నించాలని భావిస్తున్నది. ఇస్రో చైర్మన్ సోమనాథ్ ఒక ఇంటర్వ్యూలో ఈ విషయాన్ని వెల్లడించారు. 'చంద్రయాన్ సక్సెస్ తర్వాత సాధ్యమయ్యే అన్ని విషయాలపైనా మేం దృష్టి సారించాం. అంతరిక్ష కేంద్రం భారత అంతరిక్ష ఆర్థిక వ్యవస్థకు ఎలా ప్రయోజనం చేకూరుస్తుందనే దానిపై ఆలోచిస్తున్నాం' అని ఆయన తెలిపారు. గగన్‌యాన్ ప్రయోగం ద్వారా మానవ సహిత అంతరిక్ష యాత్ర చేపట్టేందుకు ఇస్రో సిద్ధమవుతున్నది.



ఈ నెలాఖరులో గగన్‌యాన్ కీలక పరీక్ష

బెంగళూరు : గగన్‌యాన్‌లో అత్యంత కీలకమైన క్రూ ఎస్కేప్ సిస్టమ్‌ను పరీక్షించేందుకు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) సన్నాహాలు చేస్తున్నది. మన దేశ తొలి మానవ సహిత అంతరిక్ష యాత్ర గగన్‌యాన్ కార్యక్రమంలో భాగంగా శ్రీహరికోట నుంచి ఈ ప్రయోగం జరుగుతుంది. విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్ డైరెక్టర్ ఎస్ ఉన్నికృష్ణన్ నాయర్ మాట్లాడుతూ, దీనికి సంబంధించిన అన్ని వెహికిల్ సిస్టమ్స్ శ్రీహరికోటకు చేరుకున్నాయని, ఫైనల్ అసెంబ్లింగ్ జరుగుతున్నదని, ఈ నెలాఖరులో దీనిని ప్రయోగిస్తామని చెప్పారు. దీన్ని రోదసీ పర్యాటకంతోపాటు అనేక విధాలుగా ఉపయోగించుకోవచ్చునన్నారు.